ఎన్. ముక్తేశ్వర రావు, ఐఏఎస్ (రిటైర్డ్)
ప్రత్యేకాధికారి (ప్రాజెక్టులు)
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ప్రస్తావన

మహామహోపాధ్యాయ శ్రీసముద్రాల లక్ష్మణయ్యగారు పండిత లోకంలో సుప్రసిద్ధులు. వారు తెలుగులో రచించిన 'రఘువంశం' భావానువాదం ఆసాంతం చదివాను. పుస్తకం చదువుతున్నంతసేపు ఏదో ప్రాచీన ప్రపంచంలో విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఆధునికంగా ఆంగ్లసాహిత్యంనుంచి వచ్చిన కల్పనాసాహిత్యం (ఫిక్షన్) ఏ మూలకూ సరిపోదు అనిపిస్తుంది. అందమైన తెలుగులో ఎక్కడా నట్టు రాకుండా వచనం పరుగులు తీస్తుంది.

ఇక కావ్యవిషయానికొస్తే రఘురాముడు జన్మించిన రఘువంశ రాజుల ఆదర్శాలు, కీర్తి, ప్రజానురంజనం మొదలైన ఉన్నతగుణాలను పతాకాస్థాయిలో వర్ణిస్తూ కాళిదాస మహాకవి ఈ కావ్యం రచించాడు.

రాజు లెందుకు? రాజు ఏమి చెయ్యాలి? ఏం చేస్తే రాజ్యం బాగుంటుంది? – అన్న చర్చ చాలా కావ్యాలలో కనబడదు. రాజులు, వారి అంతఃపుర విజయాలు, అరివీర భయంకర పరాక్రమాలవంటివే వర్ణించబడ్డాయి. అప్పటికప్పటికి ఇది చాల గొప్పగా అనిపించినా ఈ లక్షణా లేవీ కాలపరీక్షకు నిలబడలేదు. మఖలో పుట్టి పుబ్బలో పోయాయి.

కానీ, రఘువంశపు రాజులు ఎలా ఉన్నారో ఒక వంద రాజనీతి శాస్త్రాలు చెప్పలేని విషయాలను కాళిదాసు కాంతాసమ్మితంగా, రసాత్మకంగా, మనోహరంగా రచించాడు.

నా ఉద్దేశ్యంలో రఘువంశం చదవనివాడు పాలకుడు కాకూడదు. పాలకుల కిది అవశ్యపఠనీయమైన గ్రంథం.

స్థాలీపులాకంగా రఘువంశంలోని కొన్ని సన్నివేశాలను చూద్దాం.

ఆధునికయుగంలో సంక్షేమరాజ్యాలు ఏర్పడ్డాయి. ప్రజల యోగక్షేమాలు మేమే చూస్తామని చెబుతున్నాయి. రఘువంశంలో కాళిదాసు రాజు ఎలా ఉంటాడో చెబుతూ...

ప్రజానాం వినయాధానాత్ రక్షణాత్ భరణాదపి ।
స పితా పితరస్తాసాం కేవలం జన్మహేతవః ॥

దిలీపుని రాజ్యంలో జన్మించిన పౌరులయొక్క విద్య, క్రమశిక్షణ, రక్షణ, పోషణ మొదలగు సమస్తసౌకర్యాల బాధ్యతలు రాజువే. వారి తల్లితండ్రులు వారి జన్మకు మాత్రమే కారకులుగా ఉండేవారు.

రాజై పుడితే రాజ్యం చేస్తే అలా చెయ్యాలి. రాజంటే వాడే. రాజ్యం అంటే అదే.

ఇక మహిళల రక్షణ ఎలా ఉండేదో చూద్దాం.

యస్మిన్ మహీం శాసతి వాణినీనాం నిద్రాం విహారార్థ పథే గతానామ్।
వాతోఽపి నాస్రంశయదంశుకాని కో లంబయే దాహరణాయ హస్తమ్॥

దిలీపుడు రాజ్యాన్ని చేసే సమయంలో మార్గమధ్యంలో వీథులవెంట విహారానికి వచ్చి ప్రమత్తులై పడిపోయిన స్త్రీల ఒంటిమీద పమిటను కదిలించడానికి గాలి కూడా భయపడేది. ఇక వాళ్ళ మానప్రాణాలకు భయమేముంటుంది?

అంటే దిలీపుని రాజ్యంలో స్త్రీలు స్వేచ్ఛగా తమ రక్షణగురించి గాని, ఆభరణాల గురించిగాని ఎట్టి భయాలు లేకుండగా సంచరించేవారని తెలుస్తోంది. దిలీపుని పాలన గురించి ఒక్క శ్లోకంలో కొండను అద్దంలో చూపించినట్లుగా చెబుతాడు [illegible]

ప్రవర్తనా విధానంలో కూడా రఘువంశ మహారాజులు సత్యవ్రతంతో ధర్మబద్ధులై జీవించేవారు.

త్యాగాయ సంభృతార్థానాం సత్యాయ మితభాషిణామ్ ।
యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినామ్ ॥

రఘువంశపురాజులు ధనాన్ని సంపాదించేవారు. ఎందుకు? పరులకోసం త్యాగం చేయటానికే!

మితంగా మాట్లాడే వారు. ఎక్కువగా మాట్లాడితే అసత్యం దొర్లుతుందేమో అనే భయంతో!

విజయాలను కోరుకునేవారు. కీర్తికోసం మాత్రమే! (రాజ్యవిస్తరణ కోసం కాదు).

గృహస్థులయ్యే వారు. సత్సంతానం ద్వారా వంశాభివృద్ధి కోసం. పితృఋణం తీర్చుకోవటం కోసం. విషయవాంఛలకోసం కాదు.

కాకుత్థ్స వంశం రాజులు యజ్ఞాలు చేసేందుకు పూర్తి సామర్థ్యం ఉన్నా, ఒక్క యజ్ఞం పూర్తి చేస్తే ఇంద్రపదవిని పొందే అవకాశం ఉన్నా ధర్మానికి నిలబడి వదులుకున్నవారు.

ఆ రాజులూ పోయారు, ఆ రాజ్యాలూ పోయాయి. కాని కాళిదాసు అక్షరబద్ధం చేసిన 'రఘువంశం' ఆయన 'దీపశిఖ' లాగ మెరిసిపోతూనే ఉంది. ఇంత చిక్కని కావ్యాన్ని చక్కని తెలుగులో ధారాశుద్ధిగా రచించి మనకందించిన శ్రీమాన్ లక్ష్మణయ్యగారికి తెలుగుజాతి ఎంతైనా ఋణపడి ఉంటుంది. వారికి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ శ్రీనివాసుని దివ్యానుగ్రహం మెండుగా లభించి ఆయురారోగ్యాలతో, సకలాభ్యుదయాలతో జీవించాలని కోరుతున్నాను.

నందివెలుగు ముక్తేశ్వర రావు